భం గురువాణి


ఏప్రిల్ 24, 2025 సంచిక - 248

# మానవ దేహం

అనిత్యమైన శరీరాన్ని నిత్యంగా భావిస్తున్నాడు మానవుడు మరియు తన శరీరాన్ని జాగ్రత్తగా చూచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. అలాగే శరీరం చాలా సంవత్సరాల వరకు భద్రంగా ఉంటుందని అనుకొంటున్నాడు.

“ రోసిందేమిటి రోతలేమిటి మనోరోగస్థుడై దేహే
పూసిందేమిటి పూతలేమిటి మదా పూతంబులే దేహముల్
మూసిందేమిటి మూతలేమిటి సదా మూఢత్వమేగాని
చేసిందేమిటి చేతలేమిటి వృథా శ్రీకాళహస్తీశ్వరా ! ”

మనకు రోషం వస్తుంది, ద్వేషము, అసూయ



కూడ వస్తాయి. ఇవి వ్యర్థమైనటు వంటివి. ఈ దేహానికి ఏమేమో పూసుకొంటున్నాము, ఈ దేహాన్ని మూయడానికి మనిషి రకరకాల బట్టలు ఉపయోగిస్తాడు. పుట్టిన ప్పుడు బట్ట లేకుండా వస్తాడు. గిట్టినప్పుడు బట్టలు లేకుండా పోతాడు. ఈ దేహంలోని దేహి వెళ్ళిపోయిన తక్షణం ఉన్న బట్టలను ఊడబెరికి వేరే బట్టలో చుట్టి తీసుకొనిపోయి శ్మశానంలో అగ్నికి ఆహుతి చేస్తారు. లేదంటే భూమిలో పూడ్చిపెట్టేస్తారు. అటువంటి అశాశ్వతమైనటువంటిది ఈ దేహం. మానవ దేహం ఒక తోలుబొమ్మలాంటిది అంటారు మహాత్ములు. మన గురువుగారు కూడ ఒక తత్వం వ్రాసినారు.

" తా ధిమి తక ధిమి తోలుబొమ్మ
దీని తమాష చూడర మాయబొమ్మ
తాధిమి తకధిమి తళాంగుతకధిమి తోలుబొమ్మ

1. పంచభూతముల ఈ బొమ్మ ప్రపంచం నిండెర మాయబొమ్మ ।
వంచనలేక మంచి గురువుల పంచ చేరదురా పాడుబొమ్మ ॥
2. పోతే రాదుర ఈ బొమ్మ వచ్చి పోతుంటది మాయబొమ్మ ।
బస్తిని విడిచి అస్థిపురం చేరి మాయమగునురా మాయ బొమ్మ ॥

ఈ మానవ శరీరం పంచభూతంలతో కూడినటువంటి ఒక బొమ్మలాంటిది. బస్తిని విడిచి పెడితే అస్థిపురం అనగా శ్మశానం చేరుకొని మాయమైపోతుంది. అనగా కాలుస్తారు లేదా పూడుస్తారు. కనుక శిష్య భక్తాదులారా ! ఇలాంటి అశాశ్వతమైన జీవితాన్ని మానవుడు గడుపుతున్నాడు. కనుక ఈ సత్యాన్ని తెలుసుకోవాలి అందరూ. కనుక మీరందరూ కూడ సత్యమును మిథ్యగా, మిథ్యను సత్యంగా పొరపాటుపడకుండా వేదాంతులు, సద్గురువులు సూచించిన మార్గంలో ప్రయాణం చేయాలి.



శరీరమే కాదు, భార్యబిడ్డలు, మేడలు సంపదలు ఇవన్నీ అశాశ్వతములే ఈ సత్యాన్ని అందరూ తప్పకుండా తెలుసుకొని ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు పోగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.



శ్రీశ్రీ సద్గురు బాబా అన్వరానంద వారివేదాంతోపన్యాసము నుండి గ్రహింపబడినది.